క్లుప్తంగా

కంప్యూటర్ సైన్స్‌లో విద్యార్థుల ప్రతిభ హర్షణీయం

మొయినాబాద్ రూరల్: మాస్టర్ సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్లుగా కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలవడం హర్షించదగ్గ విషయమని కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీపీ సారథివర్మ అన్నారు. బుధవారం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు 2023 క్యూ-4లో ప్రపంచంలో ఉన్నత స్థానాలు సాధించడం అభినందనీయమన్నారు. మహ్మద్ ఫాతిమా గ్లోబర్ ర్యాకింగ్స్‌లో ప్రథమ స్థానం, వి.హర్ష సాయిసింగ్ రెండో స్థానాన్ని దక్కించుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ, గోప రాజు, అకాడమిక్ డీన్ హరికిరణ్, రోహిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి

- జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి ఆసక్తిని బట్టి వారు ఎంచుకున్న రంగంలో రాణించేలా ఉపాధ్యాయులు వారిని తయారు చేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ జార్జ్ థామస్, పాఠశాల కరస్పాండెంట్ మహేశ్‌యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రమేష్‌యాదవ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాందేవ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అమ్డాపూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, బాకారం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయంలో సహకరించాలని ఆయన కోరారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం

సర్పంచ్ సంధ్య



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సంధ్య, ఉపసర్పంచ్ అల్లం శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: అజీజ్‌నగర్ గ్రామ అభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ సంధ్యశ్రీశైలం, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, అజీజ్‌నగర్ ఉపసర్పంచ్ అల్లం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అజీజ్‌నగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ. 60లక్షలతో ఆయా కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించారు. పూర్తయిన రోడ్లను సర్పంచ్ సంధ్యశ్రీశైలం, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికోసం తాము ఐదు సంవత్సరాలుగా కృషి చేస్తున్నామన్నారు. తాగునీరు, డ్రైనేజీ, మురుగు కాలువ, రోడ్లు, విద్యుత్ వంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కొండల్‌రెడ్డి, గీతారాజ్‌గోపాల్‌చారి, తిరుమల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

కొత్తూరు: పట్టణంలోని పాత జాతీయ రహదారి, ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డుతో పాటు పెంజర్ల పరిధిలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పాతజాతీయ రహదారి కూడలిలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాల ఎదుట వాహనాలను నిలుపుతుండడంతో రోడ్డు ఇరుకుగా మారుతుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడం, దానికి తోడు చిరు వ్యాపారులు రోడ్డుపై కూరగాయాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతీరోజు ఉదయం అడ్డాకూలీలు వందల సంఖ్యలో రోడ్డుపై గుమిగూడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా తయారైందని ఆయన తెలిపారు.

రాజేందర్‌గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

తలకొండపల్లి: మల్లం రాజేందర్‌గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటామని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన రాజేందర్‌గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. చౌదర్‌పల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. భగవాన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ చంద్రయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మైదానాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- ఇబ్బందుల్లో గ్రామీణ క్రీడాకారులు
- వినియోగంలోకి తేవాలంటున్న జనం

మొయినాబాద్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంచుకునే విధంగా గ్రామీణ ఆట స్థలాలను క్రీడాకారుల కోసం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తించి ఉపాధి హామీ పథకం నిధులతో వాటిని నిర్మించారు. అప్పటికే కొన్ని గ్రామాల్లో ప్రాంగణాలు పూర్తయ్యాయి. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు పూర్తి చేయించి ప్రారంభించారు. ఈ క్రీడా ప్రాంగణాలను 2022, జూన్ 2వ తేదీన మండలానికి రెండు గ్రామాల్లో ప్రారంభించారు. ఆ తరువాత మిగితా గ్రామాల్లో కూడా క్రీడా ప్రాంగణాలను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు గ్రామస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారు ఏర్పాటు చేయించిన క్రీడా ప్రాంగణాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం అవీ నిరుపయోగంగా మారడమే కాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారయ్యాయి. మందు బాబుల జల్సాలకు ప్రత్యేక స్థలాలుగా మారాయని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ క్రీడా ప్రాంగణాలపై దృష్టిసారిస్తుందా? లేదా అనేది గ్రామాల్లోని యువ క్రీడాకారుల్లో చర్చించుకుంటున్నారు.

15 క్రీడా ప్రాంగణాల పూర్తి..

మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 15 చోట్ల పూర్తి చేశారు. అవి అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారం, హిమాయత్‌నగర్, చిలుకూరు, మెడిపల్లి, ముర్తుజాగూడ, అమ్డాపూర్, సురంగల్, కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్ట, పెద్దమంగళారం, శ్రీరామ్‌నగర్, ఎన్కెపల్లిల్లో తెలంగాణ గ్రామీణా క్రీడా ప్రాంగణం పేరుతో ఏర్పాటు చేసి ప్రారంభించారు. మిగిలిన 13 గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో నిర్మించలేదు.

అభివృద్ధి చేయాలి...



ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో సరైన ఏర్పాట్లు లేవు. ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను అధికారులు అభివృద్ధిలోకి తెస్తే గ్రామీణ క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసినా ఇందుకు సంబంధించి కేసీఆర్ స్పోర్ట్స్ కిట్‌లు 15 గ్రామ పంచాయతీలకు అప్పట్లో మంజూరయ్యాయి. కానీ 14 గ్రామాలకు పంపిణీ చేసి హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీకి ఇవ్వలేదు. కనీసం పాఠశాలకైన పంపిణీ చేస్తే విద్యార్థులు వాటిని ఉపయోగించుకుంటారని పలువురు వాపోతున్నారు.

-మంజుల రవియాదవ్, సర్పంచ్, హిమాయత్‌నగర్

స్థలాల కొరత వల్ల...

గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను అప్పటి ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. స్థలాల కొరత వల్ల కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయలేదు. అందులో హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కూడా ఉంది. కానీ ఆ క్రీడా ప్రాంగణం గురించి కేసు నడుస్తున్నందునా నిలిపి వేశారు. మిగితా క్రీడా ప్రాంగణాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అప్పగించారు. దీంతో వారే క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తారు.

-సంధ్యా, ఎంపీడీఓ, మొయినాబాద్

వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నేతల పూజలు



వంశీచంద్‌రెడ్డి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులు షాద్‌నగర్‌కు విచ్చేసిన సందర్భంగా జానంపేట శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పట్టణ శివారులోని కుంట రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులు షాద్‌నగర్‌కు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆలయ అర్చకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్ రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, తిరుపతిరెడ్డి, జితేందర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అప్పి, ఖదీర్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం



ఐక్యత చాటుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం కొత్తూరు మండలంలోని ఎస్‌బీపల్లి, సిద్దాపూర్, పెంజర్ల, కొడిచర్ల, మక్తగూడ, మల్లాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు తనతో పాటు నాయకులు కూడా అండగా ఉంటారని తెలిపారు. ఏ కార్యకర్తకు ఇబ్బంది వచ్చిన వెంటనే తన వంతు సహకారం అందించడానికి ముందుంటానన్నారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నట్లు తెలిపారు. రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి వారికి అండగా ప్రజాక్షేత్రంలో ఉండి పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, రాజు, మధుసూదన్‌రావు, మెండెకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి



షాద్‌నగర్: టోర్నీని ప్రారంభిస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్: కబడ్డీ పోటీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


షాద్‌నగర్: యువత క్రీడల్లో రాణించాలని మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఏపీఎల్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్ జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లను గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగించుకోవాలన్నారు. అదే విధంగా ఆటలు ఆడడం వల్ల శరీరం ధృడంగా ఎంతో ఉల్లాసంగా తయారవుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా రెట్టించిన ఉత్సాహంతో గెలుపుకోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, భరత్‌సింహారెడ్డి, మాధవరెడ్డి, పురుషోత్తంరెడ్డి, అంజన్‌రెడ్డి, సర్పంచ్ బాలమణి, దామోదర్, ర్యాకల శ్రీను, శ్రీధర్‌రెడ్డి, రాజు, రాజిరెడ్డి, ఎంపీటీసీ రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్ రూరల్: జనవరి 26 జెండా వందనం పురస్కరించుకొని ఆయా పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కెపల్లి, అమ్డాపూర్ తదితర గ్రామాల్లో రెండు రోజుల నుంచి వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తు విద్యార్థులను ఆయా క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు.

ఉద్యమకారులను ఆదుకోండి

ప్రొఫెసర్ కోదండరామ్, ఫోరం పార్లమెంటు ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి



ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఆహ్వాన పత్రం అందజేసి సన్మానిస్తున్న నాయకులు

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని ప్రొఫెసర్ కోదండరామ్, ఉద్యమకారుల ఫోరం పార్లమెంటు ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలో షాబాద్ మండల ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్మరి చెన్నయ్యలతో కలిసి ఫిబ్రవరి 4వ తేదీన చేవెళ్లలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల కృతజ్ఞత సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమ కారులను ఆదుకొని వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఈదులపల్లి రాములు, ఉద్యమకారుల ఫోరం షాబాద్, మొయినాబాద్, చేవెళ్ల మండలాల అధ్యక్షుడు కుమ్మరి చెన్నయ్య, మహిపాల్, మండల కార్యదర్శి సత్యానందం, కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, శికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి

నందిగామ: సమాజంలో ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని మొదళ్లగూడలోని సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాల డ్రైవర్లు, విద్యార్థులు తమ వాహనాలు నడిపే సమయంలో విధిగా నిబంధనలు పాటించాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలు కోల్పోతారన్నారు. దీంతో కుటుంబ సభ్యులు రోడ్డున పడే ప్రమాదం ఉందని సూచించారు. మద్యం సేవించి వాహనాలను ఎట్టి పరిస్థితిల్లో నడపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మస్తాన్ ఆలీ, శ్రీకాంత్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ: ఎంపీఓ



మాట్లాడుతున్న ఎంపీఓ గీత

శంకర్‌పల్లి: ప్రజలు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శంకర్‌పల్లి ఎంపీఓ గీత పేర్కొన్నారు. బుధవారం మోకిల గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్డు, అండర్‌డ్రైనేజీల ఏర్పాటునకు తీర్మాణం చేశారు. గ్రామంలో 284 ఇళ్లకు జీరో ట్యాక్స్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామంలో ప్రతిఒక్కరూ ఇంట్లో మొక్కలు నాటుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగభూషణ్, ఉప సర్పంచ్ గౌండ్ర రాజు, మోహన్‌రెడ్డి, గోపాల్ చారి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

- చైతన్య యూనివర్సిటీ కులపతి సిహెచ్ పురుషోత్తమ్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని చైతన్య యూనివర్సిటీ కులపతి సిహెచ్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కళాశాలలో జీవ రసాయన శాస్త్ర విభాగంలో 'స్టడీస్ ఆఫ్ పాలిగాలిస్ట్ ఎంజాయిన్ ఆజ్ పర్ లాస్ నైగర్ స్ట్రైస్ ఆర్‌పి 401' అనే అంశంపై ప్రొఫెసర్ ఎస్ సుమ పర్యవేక్షణలో కె.వెంకటనాగరాజేశ్వరి పరిశోధన పూర్తి చేసినందుకు డాక్టరేట్ పట్టా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ప్రొఫెసర్ కవిత, శ్రీనివాస్, రీసెర్చ్ డీన్ ఆచార్య ఆర్ కిష్టఫర్, జగదీష్‌కుమార్, అధ్యాపకులు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే సత్ఫలితాలు



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సత్ఫలితాలను సాధిస్తారని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రక్తహీనత ముక్తభారత్ కార్యక్రమాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌కు పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తహీనతతో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఐరన్ మాత్రలు ఇస్తుందన్నారు. విద్యార్థులు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చెప్పారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

బీజేపీ రాష్ట్ర నాయకుడు అందెబాబయ్య

షాద్‌నగర్‌రూరల్: ముదిరాజులందరు ఐకమత్యంతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర నాయకుడు అందెబాబయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో డివిజన్ ముదిరాజ్ సంఘం కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అందెబాబయ్య హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముదిరాజులను డి గ్రూపు నుంచి ఎ గ్రూపులోకి మార్చి కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని కోరారు. ఈ నెల 27న టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించే నూతన కార్యవర్గ కమిటీ ఎన్నికకు ముదిరాజులందరు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అందెపైలయ్య, మంగవెంకటేష్, అనంతయ్య, జంగయ్య, యాదయ్య, శ్రీధర్‌వర్మ, భూపాల్, శంకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కాంచనలత

చేవెళ్ల: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇంట్లో ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచాలన్నారు. ఆడ, మగ తేడాలేకుండా చూడాలన్నారు. సమాజంలో మహిళలకోసం ప్రత్యేక అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలంటే బాలికలు బాగా చదువుకోవాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బాలికల సంరక్షణకోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త అనురాధ, అధ్యాపకులు రూప్నారవీంద్రన్, షేక్ మహబూబ్, రవీందర్, రాగిణి, స్వర్ణలత, సతీష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం..

బాలికల ఎదుగుదలకు అన్నిరకాలుగా ప్రోత్సహించాలని ఖానాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, అంగన్‌వాడీ టీచర్ పంబలి భారతిలు పేర్కొన్నారు. ఖానాపూర్ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో బాలికలకు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికలను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ పంబలి భారతి సహకారంతో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీరజ, సుప్రియ, స్వాతి, జగదాంబ, రాధ, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణగౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.